సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

బుధవారం, 7, ఫిబ్రవరి, 2024



జంతు నమూనాలతో పరిశోధన
మానవ వ్యాధుల అధ్యయన పరిశోధనల్లో జంతువుల స్థానంలో వాటి నమూనాలను వినియోగించాలని వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ సూచించారు. -8లో



రూ.45 లక్షలు స్వాధీనం
బద్వేలు– నెల్లూరు జాతీయ రహదారిలోని పి.పి.కుంట చెక్‌పోస్టు వద్ద ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న రూ.45 లక్షలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.3/20.1

జిల్లాలో మంగళవారం 20.1 – 35.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

8న కడపలో జాబ్‌డ్రైవ్
వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఈనెల 8వ తేదీ ఉదయం 9 గంటలకు మినీ జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ తెలిపారు. ఆల్‌డిక్సన్, ఫ్లిప్‌కార్ట్, టాటా ఏఐఏ, వైఎఫ్ఎంఎస్ కంపెనీలు ఈ జాబ్‌డ్రైవ్‌కు విచ్చేసి అభ్యర్థులను ఎంపిక చేసుకుంటాయని చెప్పారు. 18 నుంచి 27 సంవత్సరాలలోపు అభ్యర్థులు ఈ ఎంపికలకు అర్హులన్నారు. ఆసక్తి గలవారు రెజ్యూమ్, అర్హత ధృవీకరణపత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులతో హాజరుకావాలని సూచించారు. పూర్తి వివరాలకు జేకేసీ మెంటార్లు సారధి, మంజులను 9347256400, 9490560441 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

స్పెషల్ కలెక్టర్‌గా కౌసర్‌భాను



కడప సెవెన్‌రోడ్స్: కడప గాలేరు–నగరి భూ సేకరణ విభాగం–2 ఎస్‌డీసీగా పనిచేస్తున్న ఖతీబ్ కౌసర్‌భానును ప్రభుత్వం గాలేరు–నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు స్పెషల్ కలెక్టర్‌గా నియమించారు. ఇందుకు సంబంధించిన జీఓ ఆర్‌టీ నెంబరు 284 ఉత్తర్వులు చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి మంగళవారం జారీ చేశారు. కౌసర్‌భాను అక్టోబరులో ఎస్‌డీసీగా జిల్లాలో బాధ్యతలు చేపట్టారు. ఇన్‌చార్జి జిల్లా పౌరసరఫరాల అధికారిగా కొంతకాలం పనిచేశారు. అనంతరం ఎస్‌డీసీగా కొనసాగేవారు. ప్రస్తుతం ఆమెను స్పెషల్ కలెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.

9న పోస్టర్ డిజైనింగ్ పోటీలు
కడప కల్చరల్: భారత జాతీయ కళా సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ సంస్థ (ఇంటాక్) కడప చాప్టర్ ఆధ్వర్యంలో ఈనెల 9న పోస్టర్ డిజైనింగ్ పోటీలు నిర్వహించనున్నామని చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి తెలిపారు. ఏ–3 సైజ్ పేపరులో చిత్రాన్ని గీసి దాని స్లోగన్ (వ్యాఖ్య) కూడా రాయాల్సి ఉంటుందన్నారు. వీలైనంత వరకు ఆ చిత్రం చరిత్రను కూడా క్లుప్తంగా (200 పదాలకు మించకుండా) ఏ–4 సైజులో రాయాల్సి ఉంటుందన్నారు. స్లోగన్, చిత్రం గురించిన సమాచారాన్ని ఇంగ్లీషు లేదా హిందీలో రాయాలన్నారు. 7 నుంచి 9 తరగతిలోపు విద్యార్థులు మాత్రమే పోటీలో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో శుక్రవారం ఉదయం 9.00 గంటలకు పోటీ నిర్వహిస్తామని తెలిపారు. రీజినల్ స్థాయిలో 100 మందిని ఎంపిక చేస్తామని, జాతీయ స్థాయిలో 10 మంది విజేతలను ఎంపిక చేస్తామన్నారు. పూర్తి వివరాలకు జిల్లా చాప్టర్ కన్వీనర్ 98855 66644 నెంబరులో సంప్రదించాలన్నారు.

బైజ్యూస్ ట్యాబ్‌ల ద్వారా పరీక్షలు



పరీక్షలను పర్యవేక్షిస్తున్న విద్యా శాఖాధికారులు

మదనపల్లె సిటీ: అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు బైజ్యూస్ ట్యాబుల ద్వారా మంగళవారం ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో మదనపల్లె, చిట్వేలి జెడ్పీ ఉన్నత పాఠశాలను పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశారు. ఈ పరీక్షలను ఎంఈఓ ప్రభాకర్‌రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు ఇంటి వద్దే రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్న సచివాలయ సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్: పేద ప్రజల చిరకాల స్వప్నమైన సొంతింటి కలను నెరవేరేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలం, ఇంటిపై సర్వహక్కులు కల్పిస్తూ ప్రభుత్వమే అన్ని ఖర్చులు భరించి రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తోంది. అనారోగ్యం కారణంగా రిజిస్ట్రేషన్ చేయించుకునేందుక సచివాలయానికి వెళ్లలేని స్థితిలో ఉన్న వారికి ప్రభుత్వ ఆదేశాలతో అధికారులు తమవంతుగా తోడ్పాటు అందిస్తున్నారు. ఈ క్రమంలో సచివాలయానికి వెళ్లలేని పరిస్థితిలో మంచంపై ఉన్న బాధితురాలికి కడప ఆర్డీఓ మధుసూదన్, సచివాలయాల సిబ్బందితో కలిసి కడప రెవెన్యూ డివిజన్ పరిధిలోని చెన్నూరు–2 సచివాలయ పరిధిలోని ఓ లబ్ధిదారు ఇంటికి వెళ్లి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ విషయంగా ప్రభుత్వాన్ని, అధికారులను సర్వత్రా కొనియాడుతున్నారు.

ప్రగతి చక్రం..ప్రజల నేస్తం

- ఆర్టీసీ బస్సులను ఆదరిస్తున్న ప్రయాణికులు
- పండుగలు, విశిష్ట రోజుల్లో ప్రత్యేక బస్సులు
- టీడీపీ హయాంలో ప్రత్యేక సర్వీసుల్లో అదనపు వసూళ్లు
- ప్రజలపై భారం పడకుండా జగన్ సర్కార్ చర్యలు
- పెరిగిన ఆదాయం



కడప ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు (ఫైల్)

కడప కోటిరెడ్డిసర్కిల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతోపాటు మరోవైపు ప్రయాణికులపై అదనపు భారం పడకుండా సాధారణ చార్జీలతోనే ప్రయాణం చేసేలా వీలు కల్పించారు. గత టీడీపీ హయాంలో పెద్ద పండుగలు, విశిష్ట రోజుల్లో ఏర్పాటు చేసే ప్రత్యేక బస్సుల్లో అదనపు చార్జీలతో ప్రజలను ఇబ్బందులకు గురి చేయగా, వైఎస్ జగన్ సర్కార్ ఆయా సర్వీసుల్లో కూడా సాధారణ చార్జీలు వసూలు చేయాలని నిర్ణయించారు. దీంతో స్థానికంగా తిరగడానికి సుదూర ప్రయాణాలకు ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులతో పోలిస్తే ఆర్టీసీ చార్జీలు తక్కువగా ఉండడంతో ప్రజల ఆదరణ పొందింది. అంతేకాకుండా ప్రతి ఏటా సంక్రాంతి, దసరా, కార్తీకమాసం, మహాశివరాత్రి, ఇతర తీర్థ యాత్రలకు ప్రత్యేక సర్వీసులను నడుపుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ముఖ్యంగా కడప రీజియన్ పరిధిలోని వివిధ డిపోల నుంచి ప్రతినెల తిరువన్నామలైకి నడుపుతున్న సర్వీసులకు భక్తుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. అంతేకాకుండా ప్రస్తుతం నెలకొన్న సాంకేతిక విప్లవాన్ని దృష్టిలో పెట్టుకుని టిక్కెట్ల కొనుగోలులో నగదు రహిత లావాదేవీలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా దాదాపు అన్ని బస్సుల్లో ఫోన్ పే, గుగూల్ పే, పేటీఎం అందుబాటులోకి తీసుకురావడం మరింత సౌకర్యవంతంగా మారింది.

- తమిళనాడు రాష్ట్రంలోని తిరువన్నామలైకి కడప రీజియన్ పరిధిలో 2022వ సంవత్సరం నవంబరు 30వ తేదీన సర్వీసును ప్రారంభించారు. అప్పటినుంచి రీజియన్‌లోని ప్రతి డిపో నుంచి పౌర్ణమి రోజున ఈ సర్వీసులను నడుపుతున్నారు. ఇందుకు భక్తులు కూడా తమవంతుగా ప్రోత్సాహాన్ని ఇస్తూ ముందుగానే తమ టిక్కెట్లను రిజర్వు చేసుకుంటూ వస్తున్నారు. ఇప్పటివరకు 171 సర్వీసులను 125851 కిలోమీటర్ల నడపడం ద్వారా రూ. 75,36,628 ఆదాయం ఒనగూరింది.

నాలుగేళ్లలో రూ. 5 కోట్లకుపైగా రాబడి
కడప రీజియన్ పరిధిలో కడప, బద్వేలు, జమ్మలమడుగు, బద్వేలు, ప్రొద్దుటూరు, పులివెందుల డిపోలు ఉన్నాయి. ఆయా డిపోల నుంచి హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ, చెన్నై, తిరుపతి, విశాఖపట్టణం తదితర ప్రధాన పట్టణాలకు బస్సులను నడిపారు. ఈ డిపోల నుంచి ప్రత్యేక బస్సుల ద్వారా గత నాలుగేళ్లలో రూ. 5,40,94,672 రాబడి వచ్చింది.

ఈ ఏడాది సంక్రాంతి ఆదాయం అదుర్స్
ఇటీవల సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జనవరి 10 నుంచి 22వ తేదీ వరకు ఆయా ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులను నడిపారు.వీటి ద్వారా రికార్డుల స్థాయిలో ఆదాయం ఒనగూరింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా రూ. 1,42,20,639 ఆర్జించింది. ఆర్టీసీ పట్ల ప్రయాణికులు చూపుతున్న ఆదరణ కారణంగా ఇంత పెద్ద మొత్తంలో ఆదాయం లభించిందని పలువురు పేర్కొంటున్నారు.

గత నాలుగేళ్లలో ఆర్టీసీ ప్రత్యేక సర్వీసుల ద్వారా వచ్చిన ఆదాయం

సంవత్సరం	వచ్చిన ఆదాయం
2019–20	1,23,89,393
2020–21	1,28,28,757
2021–22	42,61,966
2022–23	1,03,93,917
2023–24	1,42,20,639

ప్రభుత్వ ప్రోత్సాహంతోనే లాభాల బాట
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి కార్మికులను ప్రభుత్వోద్యోగులుగా చేశారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులు సంస్థ ఆదాయం పెంపునకు శ్రమిస్తున్నారు.

చంద్రబాబు హయాంలో నష్టాలే
చంద్రబాబు హయాంలో ఆర్టీసీకి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువైంది. అప్పట్లో కార్పొరేషన్ సంస్థగానే చూసి సక్రమంగా నిధులు విడుదల చేయలేదు. వందలాది బస్సులను పోలవరం ప్రాజెక్టు వద్దకు.. తన ప్రచార సభలకు ఉచితంగా ఉపయోగించుకుని ఆర్టీసీకి బకాయిలు పెట్టారు. దీంతో బాబు పాలనలో నష్టాలే తప్ప లాభాలు రాలేదు.

అదనపు భారం తప్పింది



పండుగలను పురస్కరించుకుని ఆర్టీసీ పలు ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులను నడిపారు. తాను ఎక్కువగా అనంతపురం, తిరుపతి, విజయవాడకు వెళ్లాల్సి వస్తుంది. సాధారణ చార్జీలతోనే స్పెషల్ సర్వీసులను నడపడంతో అదనపు భారం తప్పింది. ఒకవైపు పండుగలు, మరోవైపు ప్రైవేటు ట్రావెల్స్ అధిక ఛార్జీలు వసూలు చేస్తుండడంతో అందరూ ఆర్టీసీ ప్రయాణానికి మొగ్గుచూపుతున్నారు. – శోదషదాసి శ్యాముల్, ప్రయాణీకుడు,కడప

ప్రయాణికుల నుంచి ఆదరణ



పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో నడిపిన స్పెషల్ సర్వీసులకు ప్రయాణికుల నుంచి విశేష ఆదరణ లభించింది. జిల్లాలోని ఆరు డిపోల నుంచి ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నాం. వాటిలో సాధారణ చార్జీలే వసూలు చేస్తున్నాం. నాలుగేళ్లలో దాదాపు 5 కోట్లపైగా ఆదాయం చేకూరింది. ఆర్టీసీ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తున్నాం. – పొలిమేర గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి, కడప

ప్రగతి పథంలో ఆర్టీసీ



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.దీంతో ప్రగతిపథంలో పయనిస్తోంది. ప్రయాణికుల సౌకర్యార్థం కొత్త బస్సులను కొనుగోలు చేయడంతోపాటు విద్యుత్ బస్సులను నడుపుతున్నారు. ఆర్టీసీకి భారమైనప్పటికీ స్పెషల్ సర్వీసుల్లో సాధారణ చార్జీలు అమలు చేస్తున్నారు. అటు ఆర్టీసీ సంస్థ అభివృద్ధి, ఇటు ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి ముఖ్యమంత్రి పాటుపడుతున్నారు. రానున్న కాలంలో ఆర్టీసీని లాభాల బాట పట్టించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. – అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ ఛైర్మన్

ఏ రోజు మార్కులు ఆ రోజే నమోదు చేయాలి
- ఇంటర్ ఆర్ఐవో, డీవీఈఓ



సమావేశంలో మాట్లాడుతున్న ఇంటర్ డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి ఏ రోజు నిర్వహించిన సబ్జెక్టును అదే రోజు వాల్యూయేషన్ చేసి వచ్చిన మార్కులను ఆదే రోజు ఉదయం, సాయంత్రం మార్కులను బోర్డుకు సంబంధించి సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఇంటర్ ఆర్ఐవో బండి వెంకటసుబ్బయ్య, డీవీఈఓ శ్రీనివాసులరెడ్డి పేర్కొన్నారు. కడప మరియాపురంలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాల సెమినార్ హాల్లో మంగళవారం ప్రాక్టికల్ పరీక్ష మార్కులను ఆన్‌లైన్ చేసే విధానంపై ఆయా సబ్జెక్టు అధ్యాపకులకు డెమో నిర్వహించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో ప్రాక్టికల్ పరీక్షల మార్కులను ఓఎంఆర్ షీట్‌లో వేసి బోర్డుకు పంపించేవారన్నారు. కానీ ఈ ఏడాది నుంచి నూతన విధానాన్ని ప్రవేశ పెట్టారన్నారు. ప్రతి సబ్జెక్టు లెక్చరర్ ఉదయం నిర్వహించిన ప్రాక్టికల్ పరీక్షను ఉదయమే వ్యాల్యూయేషన్ చేసి ఆదే రోజు ఉదయం 12 నుంచి 2 గంటలలోపు, మధ్యాహ్నం తర్వాత నిర్వహించిన పరీక్ష మార్కులను సాయంత్రం 5 నుంచి 7 గంటలలోపు బోర్డు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ విషయంలో అజాగ్రత్తగా ఉంటే వెబ్‌సైట్ క్లోజ్ అవుతుందని, తర్వాత మార్కులను ఆప్లోడ్ చేయడం కుదరదన్నారు. ఈ విషయాన్ని అధ్యాపకులు గమనించాని తెలిపారు. డీఈసీ సభ్యులు మాట్లాడుతూ బోర్డు ఆదేశాలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఇందులో ఎవరు కూడా నిర్లక్ష్యం చేయరాదని సూచించారు.

ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్ రావు



మాట్లాడుతున్న పలిశెట్టి దామోదర్ రావు

ప్రొద్దుటూరు: ఏపీ పీటీడీ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ఎంప్లాయిస్ యూనియన్ పనిచేస్తోందని యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్ రావు తెలిపారు. మంగళవారం ప్రొద్దుటూరులోని బీజీఆర్ కల్యాణ మండపంలో ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్షుడు డి.గోపాల్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్ రావు మాట్లాడుతూ 2017 నుంచి 2020 వరకు ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాల్సిన లీవ్ ఎన్ క్యాష్‌మెంట్ బకాయిలను ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి బాగాలేని కారణంగా మేనేజ్ మెంట్ చెల్లించలేదన్నారు. ఎస్ఆర్‌బీఎస్, ఎస్‌బీటీ ట్రస్టులలో పొదుపు చేసుకున్న బకాయిలను వెంటనే అందరికి చెల్లించాలని డిమాండ్ చేవారు. కడప జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు కుమార్, రాజశేఖర్ మాట్లాడారు.

నూతన కమిటీ ఎన్నిక
ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్ రావు సమక్షంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిపో గౌరవాధ్యక్షుడిగా డి.గోపాల్, డిపో అధ్యక్షుడిగా పి.వెంకటేశ్వర్లు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌గా బీసీ శేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆర్.సుధాకర్‌రెడ్డి, డిపో కార్యదర్శిగా వి.రఘునాథరెడ్డి, గ్యారేజి సెక్రటరీగా ఎస్.మక్బుల్ బాషా, ట్రెజరర్ జి.గంగాధర్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బోసుబాబు, రామమూర్తి, ఏపీజేఏసీ అమరావతి మహిళా కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.పద్మావతి, అసిస్టెంట్ సెక్రటరీ శాంత కుమారి, జోనల్ నాయకులు నాగేంద్ర ప్రసాద్ రెడ్డి, రామలింగారెడ్డి, రీజనల్ నాయకులు ప్రతాప్ రెడ్డి, డిపో నాయకులు రమణ, ఎస్ఎస్‌కే రెడ్డి, ఏఎస్ వాసులు, కుళాయప్ప తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అవగాహన పెంచాలి
కడప సెవెన్‌రోడ్స్: కుష్టు వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచాలని జేసీ గణేష్‌కుమార్ అన్నారు. ఈనెల 13వ తేదీ వరకు జిల్లా అంతటా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మంగళవారం జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కుష్టు వ్యాధి గుర్తింపు కోసం ఇంటింటి సర్వే జరుగుతోందన్నారు. అన్ని గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రజలకు కుష్టి వ్యాధి పట్ల అవగాహన కల్పించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి బహుళ ఔషధ చికిత్స అందించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ శాఖ, మున్సిపల్ శాఖ, మెప్మా, డీఆర్డీఏ, విద్యా, సంక్షేమ శాఖల అధికారులు ప్రత్యేక చొరవ చూపాలన్నారు.జిల్లాను కుష్టు రహితంగా మార్చాలని చెప్పారు. వ్యాధిపై ప్రజల్లో అవగాహనను పెంచే గోడ పత్రాలను కమిటీ సభ్యులతో కలిసి జేసీ ఆవిష్కరించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ ఉమామహేశ్వర కుమార్, అదనపు డీఎంహెచ్ఓ, డీఎల్ఏటీఓ డాక్టర్ ఎస్.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేసీ గణేష్‌కుమార్ తదితరులు

నులిపురుగులను నులిమేద్దాం




కలెక్టరేట్‌లో జరిగిన టాస్క్‌ఫోర్స్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: నులి పురుగులను నలిమేస్తేనే పిల్లలను ఆరోగ్యవంతమైన పౌరులుగా తీర్చిదిద్దగలమని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 9వ తేది జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అన్ని పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులకు అల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. ఇందుకోసం వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, విద్యాశాఖ, మున్సిపల్, పంచాయతీ, పట్టణ, గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు అన్ని ఏర్పాటు చేయాలన్నారు. నులి పురుగు మనిషి పేగుల్లో మకాం వేసి రక్తాన్ని పీల్చడం ద్వారా రక్తహీనత కలిగిస్తుందన్నారు. ఇది అనారోగ్య సమస్యలకు కారణమవుతుందన్నారు. అందుకే ఈనెల 9, 16 తేదీలలో నులి పురుగుల నిర్మూలనకు అల్‌బెండజోల్ పంపిణీ చేయాలన్నారు. మాత్రలు ఇప్పటికే అంగన్వాడీ, పాఠశాలలు, కళాశాలలకు తరలించామని తెలిపారు. ఏడాది నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న వారికి మాత్రలు వేయాలన్నారు. 1 నుంచి 2 ఏళ్లలోపు పిల్లలకు 200 మిల్లీగ్రాముల, 3 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు 400 గ్రాముల మాత్రలు వేయాలన్నారు. మధ్యాహ్న భోజనం తర్వాత విద్యార్థులకు మింగించాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, చెప్పులు ధరించడం, బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన చేయకుండా మరుగుదొడ్లు ఉపయోగించడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ సందర్భంగా గోడ పత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌చంద్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎవరిగోల వారిదే..!

- ప్రొద్దుటూరు టీడీపీలో గందరగోళం
- ప్రవీణ్‌కు అండగా నిలుస్తున్న వాసు
- వరదకు మోకాలొడ్డుతున్న మల్లెల
- తెరచాటు మంత్రాంగం నిర్వహిస్తున్న పొట్లదుర్తి బ్రదర్స్



సాక్షి ప్రతినిధి, కడప: ప్రొద్దుటూరు తెలుగుదేశం పార్టీలో గందరగోళం నెలకొంది. తెలుగుతమ్ముళ్లు తలోదారిలో ఉన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు క్రమం తప్పకుండా ఒకరి తర్వాత మరొకరు తెరపైకి వస్తున్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎవరికి వారు అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటున్నారు. అది చాలదన్నట్లు జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి మైండ్‌గేమ్ ఆడుతున్నారు. అధిష్ఠానం ఎలాంటి ప్రకటన చేయకముందే అభ్యర్థిగా పోస్టర్లు ఒకరు వేయిస్తే, టికెట్ మనదే, పోటీలో ఉండేది మనమే అంటూ మరొకరు వారి వారి నెట్‌వర్క్ ద్వారా ప్రచారపర్వాన్ని అందుకుంటున్నారు.

'అలు లేదు.. చూలు లేదు.. కొడుకు పేరు సోమలింగం'అన్నట్లుగా ప్రొద్దుటూరు తెలుగుతమ్ముళ్ల పరిస్థితి నెలకొంది. ఓ వైపు టీడీపీ సొంతంగా పోటీ చేసే పరిస్థితి లేకపోగా, పొత్తుల సమీకరణ పనిలో అధినేత చంద్రబాబు నిమగ్నమయ్యారు. అధినేత ఆ పరిస్థితిలో ఉంటే నాయకులు ప్రొద్దుటూరులో టికెట్ తమదేనని ఎవరికి వారు తెరపైకి వస్తున్నారు. మాజీ ఎమ్మెల్యేలు నంద్యాల వరదరాజులరెడ్డి, మల్లెల లింగారెడ్డి, ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు ఇప్పటికే ప్రచారంలో నిమగ్నం కాగా, సోదరులమంతా అధినేతను కలిశాం. తుది జాబితాలో తానే ఉంటానంటూ సురేష్‌నాయుడు తెరచాటు మంత్రాంగం నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో సీనియర్ నేత వరదరాజులరెడ్డితో వైరం లేకుండా జాగ్రత్త పడుతున్నట్లు పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

వరదపై మల్లెల మండిపాటు
ఈమారు ఎన్నికల్లో తాను లేదా తన కుమారుడు కొండారెడ్డి పోటీలో ఉంటామని మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రచారం కొనసాగిస్తున్నారు. బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పర్యటిస్తున్నారు. అయితే తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకునే అర్హత వరదరాజులరెడ్డికి లేదని జిల్లా అధ్యక్షుడు మల్లెల లింగారెడ్డి విమర్శిస్తున్నారు. సభ్యత్వమే లేని వరద ఎలా ప్రచారం చేస్తారని మండిపడుతున్నారు. జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి మాటలు నిజమే అయితే, అధినేత చంద్రబాబు వద్దకెళ్లి వరద కుటుంబాన్ని పార్టీ నుంచి బహిష్కరించే చర్యలు చేపట్టవచ్చు కదా...అని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ఆహ్వానం లేకపోయినా నోరెత్తని లింగారెడ్డి, ఉనికి కోసం ఆరాట పడుతున్నారని వరద వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఇలా ఎవరికి వారు ప్రచారం చేసుకుంటుండటంతో ప్రొద్దుటూరు తెలుగుదేశంలో గందరగోళం నెలకొంది. తలోదిక్కుగా తెలుగుతమ్ముళ్లు వ్యవహరిస్తుండటం విశేషం.

ప్రవీణ్‌కు వాసు వత్తాసు
పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి ప్రొద్దుటూరు ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి వత్తాసుగా నిలుస్తున్నారు. ఆయన చర్యలే అందుకు దర్పణంగా నిలుస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ప్రవీణ్‌కుమార్ రెడ్డి పేరుతో ప్రొద్దుటూరులో పోస్టర్లు వెలిశాయి. నలుగురు ఆశావహులు ఉండటం, అధిష్ఠానం ప్రకటనతో నిమిత్తం లేకుండా రాత్రికి రాత్రి వాల్ పోస్టర్లు తెరపైకి రావడంతో తక్కిన వారు జీర్ణించుకోలేని పరిస్థితి తలెత్తింది. తాజాగా శ్రీనివాసులరెడ్డి ఏడాది క్రితమే నారా లోకేష్, ప్రవీణ్ నాయకత్వానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని తేల్చి చెప్పారు. తాను సైతం పార్లమెంటు అభ్యర్థిగా ప్రకటించుకున్నారు. రామేశ్వరం రోడ్డులో టీడీపీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఆయన ఈ విషయం చెప్పుకొచ్చారు. కాగా, ఆకార్యక్రమానికి స్థానికంగా నివాసం ఉంటున్న జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డిని ఆహ్వానించకపోవడం గమనార్హం. ఇన్‌చార్జి ప్రవీణ్ చర్యలకు వత్తాసుగా నిల్చే విధంగా పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి చర్యలున్నాయని పరిశీలకులు వెల్లడిస్తున్నారు.

డీఈఓ రాఘవరెడ్డికి ఆర్‌జేడీగా పదోన్నతి



ఆర్‌జేడీగా నియమితులైన రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్ జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేస్తున్న ఎద్దుల రాఘవరెడ్డికి ప్రభుత్వం పాఠశాల విద్య ఆర్‌జేడీగా పదోన్నతి కల్పించింది. ఈ మేరకు స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి ఉత్తర్వులను జారీ అయ్యాయి. ఈయన 2023 మార్చి 7వ తేదీ నుంచి డీఈఓగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయన నేడో, రేపో కడప ఆర్‌జేడీ కార్యాలయంలో పాఠశాల విద్య ఆర్‌జేడీగా బాధ్యతలు చేపట్టనున్నారు.

వైఎస్సార్ జిల్లా డీఈఓగా అనూరాధ....
వైఎస్సార్ జిల్లా డీఈఓ పోస్టుకు నంద్యాల డీఈఓ కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న అనురాధకు డీఈఓగా పదోన్నతి కల్పించి ఇక్కడికి బదిలీ చేశారు. ఆమె కూడా నేడో, రేపో బాధ్యతను చేపట్టనున్నారు.

కడప ఏడీ దేవరాజుకు చిత్తూరు డీఈఓగా పదోన్నతి...
కడప డీఈఓ కార్యాలయంలో మధ్యాహ్న భోజన ఏడీగా పనిచేస్తున్న దేవరాజుకు చిత్తూరు జిల్లా డీఈఓగా పదోన్నతి లభించింది.

అన్నమయ్య ఏడీ వరలక్ష్మికి అనంతపురం డీఈఓగా పదోన్నతి...
అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో ఏడీగా పనిచేస్తున్న ఏడీ వరలక్ష్మికి కూడా డీఈఓగా పదోన్నతి లభించింది.ఆమెకు అనంతపురం డీఈఓ పోస్టింగ్ ఇచ్చారు.

జంతు నమూనాలతో పరిశోధనలు

- 3 ఆర్ విధానాన్ని పరిశోధకులు అవలంబించాలి
- వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్
- మానవవ్యాధుల అధ్యయనంపై రెండు రోజుల సెమినార్ ప్రారంభం



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, పరిశోధకులు

వైవీయూ : మానవ వ్యాధుల అధ్యయన పరిశోధనల్లో జంతువుల స్థానంలో వాటి నమూనాలను వినియోగించాలని యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ సూచించారు. వైవీయూలో ×మానవ వ్యాధుల అధ్యయనం కోసం జంతు నమూనాలు.. నైతిక విలువలు, ప్రత్యామ్నాయ మార్గాలు౯ అన్న అంశంపై మంగళవారం రెండు రోజుల సెమినార్ ప్రారంభమైంది. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి అధ్యక్షతన వైవీయూలోని తాళ్లపాక అన్నమాచార్య సెనెట్ హాల్లో జరిగిన ఈ సెమినార్‌కు వైస్ చాన్సలర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ జంతువులను ఉపయోగించేటప్పుడు 3 ఆర్ (రీప్లేస్‌మెంట్, తగ్గింపు, శుద్ధీకరణ) వ్యూహాన్ని వినియోగించాలన్నారు. గత కొన్నేళ్లుగా క్లినికల్, బయోమెడికల్ పరిశోధనలో జంతు పరీక్ష నమూనాలను భర్తీ చేసేందుకు అనేక ప్రత్యామ్నాయ పద్ధతులు అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. సెల్-ఆధారిత పరీక్షలు, మైక్రోఫ్లూయిడ్ చిప్స్, కణజాల నమూనాలు, కంప్యూటర్ నమూనాలు, మానవ శరీర దాతలు, మానవ కణం, కణజాల-ఆధారిత పరీక్షల ద్వారా పరిశోధనలు చేయవచ్చన్నారు. 20 ఏళ్ల కిందటే ఇంటర్మీడియట్ విద్యలో ప్రయోగాల కోసం జంతువుల వినియోగాన్ని నిషేధించారని గుర్తుచేశారు. జంతువులకు బదులుగా, ఈ మానవ-ఆధారిత నమూనాలను జీవ, వ్యాధి ప్రక్రియలు, ఔషధ జీవక్రియలను అధ్యయనం చేయడానికి ఉపయోగించవచ్చన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ పరిశోధకులు జంతువులను మనుషుల్లా చూడాలని కోరారు. ప్రత్యామ్నాయ విధానాల ద్వారా పరిశోధనలు ముందుకెళ్లాలన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ జంతువుల సంరక్షణ చట్టాలను హక్కులు, పరిశోధనల పేరుతో నష్టం కలిగిస్తున్నామని, 60 శాతం జంతువులు, జీవ, వైద్య ప్రయోగాల్లో వినియోగిస్తున్నారని తెలిపారు. సెమినార్ కన్వీనర్, జువాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్. వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ రెండురోజుల సదస్సుకు దేశంలోని పరిశోధకుల నుచి 80 పరిశోధన పత్రాలు వచ్చాయన్నారు. మానవులకు, సమాజానికి మేలు చేసే జంతువులు పరిశోధనల పేరుతో వాటికి నష్టం కలిగించడం సరికాదన్నారు. పరిశోధన ,బోధనలో జంతువుల వినియోగంపై ప్రపంచం అంతటా కఠినమైన నిబంధనలు ఉన్నాయన్నారు. భారతదేశం నైతిక విలువలకు లోబడే జంతు సంరక్షణ చట్టాలను అమలు చేస్తోందన్నారు. వైవీయూ సైన్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ జంతురాజ్యం దెబ్బతింటే ఆహార గొలుసులో తేడాలు ఎదురై ప్రమాదకర పరిస్థితులు ఏర్పడతాయన్నారు. తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఫిజియాలజీ విశ్రాంత ప్రొఫెసర్ వి.హెచ్.రావు కీలక ఉపన్యాసం చేస్తూ జంతు ప్రయోగాలకు ప్రత్యామ్నాయ పద్ధతులను కనుగొని అనుసరించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. శాంతిభట్నాగర్ అవార్డు గ్రహీత, హైదరాబాద్ సీడీఎఫ్‌డీ గ్రూప్ లీడర్ డాక్టర్ మద్దిక సుబ్బారెడ్డి మాట్లాడుతూ జంతువులకు ప్రత్యామ్నాయంగా బ్యాక్టీరియా, సక్కరోమైసిస్ , డ్రోసోఫిలా, జీబ్రా ఫిష్, సి.ఎలిగిన్స్ వంటి బ్యాక్టీరియా, నెమటోడ్, చేపలను వినియోగించవచ్చన్నారు. వాటి ద్వారా దీర్ఘకాలిక వ్యాధులను నివారించే మందులు తయారవుతున్నాయని తెలిపారు. శాస్త్రవేత్త డాక్టర్ జె. జగన్‌మోహన్ రెడ్డి ఇన్విట్రో ప్రత్యామ్నాయాలపై మాట్లాడారు. రేవా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ పసుపులేటి విశ్వేశ్వరరావు జీవక్రియ వ్యాధుల కోసం జంతు నమూనాలు, ఊటీ జేఎస్ఎస్ ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ టి.కె. ప్రవీణ్ జంతు ప్రయోగాల చరిత్ర ప్రత్యామ్నాయాలపై ప్రసంగించారు. ఈ సదస్సులో సెమినార్ నిర్వహణ సంఘం సభ్యులు డాక్టర్ ఎస్.పి.వెంకట రమణ, డాక్టర్ వి. అనుప్రసన్న, డాక్టర్ ఎ.టి. వెంకటరమణారెడ్డి, డాక్టర్ ఎ.ఎస్. పి. మరియదాస్, బి. మనస్వి , పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే ఆర్థికాభివృద్ధితోపాటు సమాజాభివృద్ధి సాధ్యమని యంగ్ మెన్స్ క్రిష్టియన్ అసోసియేషన్ (వైఎంసీఏ) సౌత్ ఈస్ట్ ఇండియా రీజనల్ చైర్మన్ డాక్టర్ రోలాండ్ విల్లియమ్స్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ బెస్టీ విలియమ్స్‌లు అన్నారు. మంగళవారం స్థానిక నబీకోటలోని రోసమ్మ మైనారిటీ ఎడ్యుకేషన్ సంస్థలో మహిళా సాధికారత, రీజినల్ ఉమెన్ అండ్ జెండర్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఇంటికి పరిమితం కాకుండా రాజకీయాల్లో రాణించాలన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరారు. జాతీయస్థాయిలో మహిళలు అనేక పదవుల్లో ఉండడం సంతోషదాయకమని, పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో మహిళలు ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో యంగ్ మెన్స్ క్రిష్టియన్ అసోసియేషన్ ప్రతినిధులు రాజారత్నం ఐజాక్, పద్మాకర్ ఐజాక్, డాక్టర్ రొనాల్డ్ విలియమ్స్, కృపానంద్, జెన్నిఫర్ విక్టోరియా, సునీల్‌కుమార్, మ్యాథ్యూపీటర్, షీలా జాక్సన్ తోపాటు వివిధ జిల్లాలకు చెందిన వైఎంసీఏ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం బాటిళ్లు స్వాధీనం

వల్లూరు : కడప - తాడిపత్రి ప్రధాన రహదారిలో వల్లూరు మండల పరిధిలోని సత్యా గ్రీన్ సిటీ సమీపంలో ఉన్న డాబా వద్ద మంగళవారం అక్రమ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట రమణ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తమ సిబ్బందితో కలిసి దాడి నిర్వహించి అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి 40 బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ దుర్మరణం


గురు భాస్కర్(ఫైల్)

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు బైపాస్ రోడ్డులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గండికోట గ్రామ మాజీ సర్పంచ్ పొతనబోయిన గురు భాస్కర్ (40) దుర్మరణం చెందాడు. ఏఎస్ఐ మురళీ యాదవ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ముద్దనూరు రహదారిలో ఉన్న నీళ్ల ట్యాంక్ వీధికి చెందిన పొతనబోయిన గురు భాస్కర్ వ్యక్తిగత పనుల నిమిత్తం మోటార్ బైక్‌లో బైపాస్ రోడ్డు మీదుగా ప్రొద్దుటూరుకు బయలుదేరాడు. ఎస్ఆర్ పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లగానే వెనుక వైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో గురుభాస్కర్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రైవేట్ రుణ యాప్‌ల ఉచ్చులో పడొద్దు

'నాబార్డు'జిల్లా డీడీఎం విజయ విహారి


మాట్లాడుతున్న నాబార్డు జిల్లా డీడీఎం విజయ విహారి

కడప కోటిరెడ్డిసర్కిల్ : దైనందిన, వ్యాపార అవసరాల నిమిత్తం ప్రజలు ప్రైవేట్ రుణ యాప్‌లను ఆశ్రయించి ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని, ఆయా యాప్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని నాబార్డ్ జిల్లా డీడీఎం బి. విజయ విహారి పేర్కొన్నారు. రాయలసీమ హరిజన గిరిజన బ్యాక్‌వర్డ్ మైనార్టీ సేవా సమాజం ఆధ్వర్యంలో స్థానిక హోటల్ మయూర గార్డెనియాలో మంగళవారం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా డీఫండ్స్ సహకారంతో రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యులకు ×పొదుపు ఖాతాదారుల ఆర్థిక విద్య౯ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలు తీసుకున్న తర్వాత అధిక వడ్డీలు చెల్లించలేక, వారి వేధింపులు భరించలేక ఎంతో మంది ప్రజలు ప్రాణాలు తీసుకుంటున్నారని తెలిపారు. తక్కువ వడ్డీకే అనేక ప్రభుత్వ బ్యాంకులు వివిధ రుణాలను మంజూరు చేస్తున్నాయని తెలిపారు. ఇటీవల కాలంలో పెరిగిపోయిన సైబర్ నేరాల పట్ల ప్రజలు, రైతులు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకుని రాణించాలన్నారు. సంపాదనతోపాటు సరైన పద్ధతులలో పొదుపు చేయడం కూడా అత్యంత ముఖ్యమన్నారు. జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బ్యాంకింగ్ కార్యకలాపాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆర్బీఐ డీ ఫండ్స్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కెనరా బ్యాంక్ డీపీఎం రాజశేఖర్ మాట్లాడుతూ బ్యాంకులలో అన్ క్లైమ్డ్ డిపాజిట్లు పేరుకుపోతున్నాయని, ప్రభుత్వ సెక్టార్‌లో రూ.36 వేల కోట్లు, ప్రైవేట్ సెక్టార్‌లో రూ. 6 వేల కోట్లు కలుపుకొని రూ. 42 వేల కోట్లకు చేరుకున్నాయన్నారు. ఆర్‌హెచ్ జీబీఎం ఎస్ఎస్ డైరెక్టర్ బీవీ రత్నం మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా ప్రజలకు, రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిండికేట్ బ్యాంక్ రిటైర్డ్ ఆర్ఎం రఘునాథ రెడ్డి, ఎస్‌బీఐ లైఫ్ రిటైర్డ్ ఏరియా మేనేజర్ కె. నాగరాజు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే జొన్నలు విక్రయించండి


మాట్లాడుతున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

కమలాపురం : జొన్న రైతులు తమ దిగుబడులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మార్కెట్ యార్డు చైర్మన్ ఎన్‌సీ పుల్లారెడ్డి, సివిల్ సప్‌లై డీఎం అర్జున్‌రావ్‌తో కలసి విలేకరులతో మాట్లాడారు. చెన్నూరు, ఖాజీపేట, చాపాడు, దువ్వూరు, బద్వేల్, మైదుకూరు, అట్లూరు మండలాల్లో జొన్న పంట విస్తారంగా సాగు చేశారన్నారు. జొన్న రైతులకు జగనన్న ప్రభుత్వం రూ.3180 క్వింటాకు మద్దతు ధరగా ప్రకటించిందని, బహిరంగ మార్కెట్‌లో క్వింటా ధర కేవలం రూ.2000-2100 మాత్రమే ఉందన్నారు. దాదాపు రూ.1000 తేడా ఉందని, ప్రతి రైతు తమ జొన్న దిగుబడులను తప్పని సరిగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ప్రస్తుతం జొన్నలతో పాటు కొర్రలు, సొద్దలు, పసుపు, వరి, రాగులు, మినుములు తదితర దిగుబడులు కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. అన్నదాతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

లూర్దుమాతను ప్రార్థిస్తే సర్వం సాధ్యమే


లూర్దుమాత స్వరూపాన్ని ఊరేగిస్తున్న భక్తులు

కడప కల్చరల్ : మహిమగల తల్లి లూర్దుమాతను ప్రార్థిస్తే సర్వం సాధ్యమేనని చిత్తూరు జిల్లా శివాడి విచారణ గురువులు దాసరిపల్లి సుమంత్ అన్నారు. కడప నగర పరిధిలోని మరియాపురం పుణ్యక్షేత్రంలో నవదిన పూజోత్సవాల్లో భాగంగా ఐదవరోజు మంగళవారం జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమానికి ఆయన అతిథిగా విచ్చేశారు. మైదుకూరు విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ బళ్లారపు ఆశీర్వాదం తొలుత దివ్య బలిపూజ సమర్పించగా, ఫాదర్ సుమన్ లూర్దుమాత మహిమల గురించి ప్రసంగించారు. మానవుని మేధస్సు విపరీతంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత తరుణంలో ఊహలకు కూడా అందని ఎన్నో వింతలను మానవుడు చేయగలుగుతున్నాడని తెలిపారు. అయినా మానవాళికి సంతోషం లభించడం లేదని, ఇంకా ఏదో సాధించాలన్న అసంతృప్తితో నిరంతర అన్వేషణ చేస్తున్నారని చెప్పారు. ఇలాంటి వారు లూర్దుమాత చెంతకు చేరి ఆరాధిస్తే వారికి సర్వం సాధ్యమేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో తొలుత విచారణ గురువులు, తిరునాల కమిటీ ప్రతినిధులు, స్థానిక ప్రముఖులు విశ్వాసులతో కలిసి పెద్ద ఎత్తున మరియమాత విగ్రహాన్ని ఊరేగిస్తూ కార్యక్రమ వేదిక వద్దకు వచ్చారు. అనంతరం దివ్య బలిపూజ చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. కారుణ్య సంఘం సభ్యులు లూర్దుమాత తేరును అలంకరించి ఊరేగింపులో స్తుతిగీతాల ఆలాపన చేశారు. కార్యక్రమంలో విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ బిరుసు రాజా, సహాయ గురువు ఫాదర్ అరుణ్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలో రూ.45 లక్షలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న నగదు వివరాలను వెల్లడిస్తున్న మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్

బద్వేలు అర్బన్ : ఎన్నికలు సమీపిస్తున్న వేళ పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున బద్వేలు - నెల్లూరు జాతీయ రహదారిలోని పి.పి.కుంట చెక్‌పోస్టు వద్ద ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న రూ.45 లక్షలు నగదును బద్వేలు రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మైదుకూరు డీఎస్పీ ఎస్.ఆర్.వంశీధర్‌గౌడ్ వివరాలను వెల్లడించారు. బద్వేలు టౌన్ గాంధీనగర్‌కు చెందిన పెడకల మల్లేష్ కువైట్‌లో ఉంటున్న వెంకటసుబ్బయ్య సూచన మేరకు నెల్లూరుకు వెళ్లి అక్కడ రైల్వే స్టేషన్ వద్ద నరసింహ అనే వ్యక్తిని కలిసి అతని వద్ద నుంచి ఎలాంటి రసీదులు లేని రూ.45 లక్షలు తీసుకున్నాడు. ఆ తర్వాత బద్వేలుకు ఆర్టీసీ బస్సులో వస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పి.పి.కుంట చెక్‌పోస్టు వద్ద రూరల్ సీఐ విక్రమసింహ, రూరల్ ఎస్ఐ రవికుమార్‌లు బస్సును ఆపి మల్లేష్ బ్యాగును తనిఖీ చేయగా అందులో రూ.45 లక్షల నగదు ఉండటంతో దానిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో అర్బన్ సీఐ యుగంధర్, రూరల్ ఏఎస్ఐ భూపాల్‌రెడ్డి, కానిస్టేబుల్ అమర్ తదితరులు పాల్గొన్నారు.

కొండాపురంలో రూ. 19.50 లక్షలు ..

కొండాపురం : ముచ్చుమర్రి గ్రామ సమీపంలో కొండాపురం పోలీసులు మంగళవారం నిర్వహించిన వాహనాల తనిఖీలో రూ. 10లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు కొండాపురం ఎస్ఐ యోగేంద్ర తెలిపారు. అలాగే తాళ్లప్రొద్దుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో కె.సుగుమంచిపల్లె చెక్‌పోస్ట్ వద్ద ఓ వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో రూ.9.50 లక్షలు నగదు సీజ్ చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

నవశకం

అమ్మఒడి వరం లాంటిది



మేము బద్వేలు పట్టణంలోని 7వ వార్డులో గల బెస్తవీధిలో నివాసముంటున్నాము. నా భర్త సురేష్ పెయింటింగ్ పని చేస్తారు నా కుమార్తె స్వాతి క్రిష్ణవేణి ఇంగ్లీషు మీడియం స్కూల్ 7వ తరగతి చదువుతోంది. గతంలో పాప చదువుకు సంబంధించిన పుస్తకాలు, బ్యాగు తదితరాలకు వేలల్లో డబ్బు ఖర్చయ్యేది. ఈ పరిస్థితుల్లో ముఖ్యమంత్రిగా జగనన్న వచ్చాక ప్రతి ఏటా అమ్మఒడి కింద ఇచ్చే రూ.15 వేలు సాయం మాకెంతో ఆసరాగా నిలుస్తోంది. అలాగే గతంలో కంటే బడి రూపు రేఖలు కూడా బాగుపడ్డాయి. కార్పొరేట్ స్కూళ్ల తరహాలో బడిని మార్చేశారు. అలాగే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పాపకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఇంటి వద్దకే అందజేశారు.

– జి.స్వాతి, బెస్తవీధి, బద్వేలు

సొంతింటి కల నెరవేరింది



సొంతింటి కల నెరవేరిందని మండల పరిధిలోని రామక్కపల్లికి చెందిన పోలి చెంగల్ రెడ్డి ఆనందంగా ఉంది. నిరుపేదలమైన మేము గతంలో ఇల్లులేక అనేక అవస్థలు పడ్డాము. జగనన్న ముఖ్యమంత్రి కాగానే మాకు స్థలంతోపాటు ఇల్లు కూడా మంజూరు చేశారు. ప్రభుత్వం అందించిన నగదు, సిమెంట్, ఇసుక, కడ్డీలు తదితర సామగ్రితోపాటు మా రెక్కల కష్టాన్ని తోడు చేయడంతో ఇల్లు బాగా కట్టుకున్నాము. మాకు అమ్మఒడి, విద్యా దీవెన, వైఎస్సార్ ఆసరా తదితర పథకాలు ప్రభుత్వం అందిస్తోంది. మా పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో రుచికరమైన ఆహారంతో పాటు కార్పొరేట్ విద్యను అందించడం చాలా గొప్ప విషయం. మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి అయితే నాలాంటి నిరుపేదలందరూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు. పిల్లలు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారు.

– పోలి చెంగల్ రెడ్డి, రామక్కపల్లి, అన్నమయ్య జిల్లా

రక్షణ కల్పించాలని ఎస్పీకి వినతి


ఎస్పీకి ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఎస్.ఎస్.ఎస్. డెవలపర్స్ సంస్థ బాధితులు

కడప అర్బన్ : కర్ణాటకకు చెందిన ఎస్.ఎస్.ఎస్ డెవలపర్స్ కంపెనీ నిర్వాహకుల నుంచి తమకు రక్షణ కల్పించాలని బాధితులు మంగళవారం ఎస్పీ సిద్దార్థ్ కౌశల్‌కు వినతిపత్రం అందజేశారు. బాధితుల కథనం మేరకు కర్ణాటకకు చెందిన ఎస్.ఎస్.ఎస్. డెవలపర్స్ సంస్థ వారు తాము రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నామని, తమ దగ్గర ప్లాట్స్ కొనుగోలుతో పాటు, రూ. లక్ష పెట్టుబడిగా పెడితే నెల నెలా బోనస్‌ను రూ. 19 వేల చొప్పున పదినెలల్లో రూ. 1.90 లక్షలు ఇస్తామని నమ్మబలికించారు. దీంతో జిల్లాలో చాలా మంది ఈ సంస్థలో పెట్టుబడులను పెట్టారు. ఐదారు నెలలు ఈ సంస్థ ద్వారా ప్రతి పెట్టుబడిదారునికి డబ్బులు బోనస్ రూపంలో అందాయి. ఆ తర్వాత కోట్లాదిరూపాయలను దండుకున్న సంస్థ బోర్డు తిప్పేసింది. దీంతో బాధితులలో కొందరు కర్ణాటకకు బయలుదేరి వెళ్లారు. అక్కడ పోలీసులు, సంస్థ ప్రతినిధులతో కుమ్మక్కయ్యారని బాధితులు ఆరోపించారు. ఈనెల 4వ తేదీన కర్ణాటకకు చెందిన కొందరు ఎర్రగుంట్లకు వాహనాల్లో వచ్చి శ్రీనివాసుల రెడ్డి అనే బాధితుడిని బెదిరించి తమ వాహనంలో తీసుకుని వెళ్తుండగా ×దిశ౯యాప్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన పోలీసులు అతన్ని వారి నుంచి కాపాడారు. కర్ణాటకలోని సంస్థ నుంచి తమకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని బాధితులు ఎస్పీకి విజ్ఞప్తి చేశారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు


నిందితుడు బెల్లం యేసు

తిరుపతి లీగల్ : హత్య కేసులో వైఎస్సార్ జిల్లా, జమ్మలమడుగు, నాగలకట్టు, సంజామలమోటుకు చెందిన బెల్లం యేసుకు జీవిత ఖైదు, రూ.1,000 జరిమానా విధిస్తూ తిరుపతి పదో అదనపు జిల్లా జడ్జి టి.రామచంద్రుడు మంగళవారం తీర్పు చెప్పారు. కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోటేశ్వర రెడ్డి, కోర్టు మానిటరింగ్ అధికారి ఈశ్వరయ్య కథనం మేరకు..నిందితుడు బెల్లం యేసు మొదట్లో కారు డ్రైవరు. తన భార్య చనిపోవడంతో అతను తిరుపతికి వలస వచ్చాడు. తర్వాత అతనికి 2021 డిసెంబర్‌లో కుష్టువ్యాధి రావడంతో కరకంబాడి రోడ్డులోని ఎస్వీ పూర్ హోమ్‌లో ఉంటూ చికిత్స తీసుకుని 2022 జూన్ 3వ తేదీన డిశ్చార్జ్ అయ్యాడు. అప్పటి నుంచి అతను భిక్షగాడిగా.. పాత వస్తువులు సేకరించే వాడిగా జీవిస్తూ బస్టాపుల వద్ద నిద్రించేవాడు. ఇదిలా ఉండగా ముందు నుంచి గుర్తుతెలియని వ్యక్తికి, నిందితుడు యేసుకు తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. 2022 జూన్ 26న చెర్లోపల్లి-తిరుపతి మెయిన్ రోడ్డు తాటితోపు సమీపంలోని మద్యం షాపులో నిందితుడు మద్యం తాగాడు. గుర్తుతెలియని వ్యక్తి అక్కడికి రావడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మద్యం షాపు సిబ్బంది ఇద్దరినీ అక్కడి నుంచి పంపేశారు. దీనిపై కక్ష పెంచుకున్న నిందితుడు, గుర్తుతెలియని వ్యక్తిని ఎలాగైనా అడ్డు తొలగించుకోవాలనుకున్నాడు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి తాటితోపు సమీపంలోని వీరేష్ వెల్డింగ్ షాపు వద్ద మద్యం మత్తులో నిద్రిస్తుండగా రాత్రి సమయంలో వెళ్లి అతనిపై పెద్ద బండరాయి వేశాడు. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఆపై నిందితుడు బెల్లం యేసు అక్కడి నుంచి పరారయ్యాడు. మరుసటి రోజు తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లికి చెందిన అప్పటి వీఆర్వో బి.శ్యామల ఎమ్మార్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ పి.సురేంద్రనాథ్‌రెడ్డి కేసు దర్యాప్తు చేసి 2022 జూలై 2వ తేదీన నిందితుడు బెల్లం యేసును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

గాలిపటం తీసేందుకు వెళ్లి..

– విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి


మృతిచెందిన విద్యార్థి మణి

గోపవరం : గాలిపటం ఎగురవేస్తున్న సమయంలో అది విద్యుత్ తీగలకు తగులుకుంది. దానిని తీసుకునేందుకు విద్యుత్ స్తంభం ఎక్కి షాక్‌కు గురై ఒక్కసారిగా కిందపడి విద్యార్థి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే మండలంలోని గోపవరం ప్రాజెక్టు కాలనీ-1కు చెందిన నల్లిపోగుక్రాంతి, సావిత్రిల రెండవ కుమారుడు నల్లిపోగు మణి (14) మంగళవారం సాయంత్రం బడి నుండి ఇంటికొచ్చిన తర్వాత గాలిపటం ఎగురవేస్తుండగా ఒక్కసారిగా అది విద్యుత్ తీగలకు తగులుకుంది. గాలిపటాన్ని తీసుకునేందుకు విద్యార్థి స్తంభంపైకి ఎక్కాడు. విద్యుత్ సరఫరా అవుతుందన్న విషయాన్ని గమనించకుండా ఎక్కడంతో ఒక్కసారిగా షాక్‌కు గురై స్తంభంపై నుండి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయమై రక్తస్రావం అయింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది హుటాహుటిన గాయపడిన విద్యార్థిని కడపకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు 108 సిబ్బంది గుర్తించారు. మృతిచెందిన మణి బద్వేలు జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. రోజూ మాదిరే పాఠశాలకు వెళ్లి తిరిగి వచ్చి ఆటలాడుకుంటున్న సమయంలో గాలిపటం రూపంలో తమ కుమారుడిని మృత్యువు కబళించిందని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు విలపించారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బద్వేలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

పెద్దముడియం : మండలంలోని జంగాలపల్లె గ్రామంలో 30 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పార్టీలో చేరిన వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చవ్వా క్రిష్ణారెడ్డి, రాంగోవిందరెడ్డి, బాలగోవిందరెడ్డి, శివరామిరెడ్డి, గ్యాస్ శివారెడ్డి, శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

కడప రిమ్స్ పీజీ వైద్య విద్యార్థినికి గోల్డ్‌మెడల్


వీసీ నుంచి గోల్డ్ మెడల్ అందుకుంటున్న డాక్టర్ మల్లిక

కడప అర్బన్ : విజయవాడలోని డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో కడప ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల గైనకాలజీ పీజీ వైద్య విద్యార్థిని డాక్టర్ షేక్ మల్లిక గోల్డ్‌మెడల్ సాధించారు. డాక్టర్ షేక్ మల్లిక 2017 -2020 వరకు కడపలోని ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాలలో గైనకాలజీలో పీజీ వైద్య విద్య పూర్తి చేశారు. 2020లో జరిగిన పీజీ పరీక్షలలో అత్యున్నత స్థానం అందుకున్నారు. మంగళవారం జరిగిన 26వ స్నాతకోత్సవంలో డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ బాబ్జి నుంచి స్వర్ణ పతకం అందుకున్నారు. ఈ సందర్భంగా కడప ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. సురేశ్వర్ రెడ్డి, సీఎస్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీనివాసులు, గైనకాలజీ హెచ్ఓడీ డాక్టర్ లక్ష్మీసుశీల, డాక్టర్ కేశవచంద్ర, డాక్టర్ రేఖారావు తదితరులు అభినందించారు.

రోడ్డు భద్రతా చట్టాలపై అవగాహన అవసరం


కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, వైద్య విద్యార్థులతో అతిథులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రోడ్డు భద్రత చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఉప రవాణా కమిషనర్ మీరా ప్రసాద్ పిలుపునిచ్చారు. మంగళవారం ఫాతిమా మెడికల్ కళాశాలలో విద్యార్థులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో ఆస్పత్రికి తరలిస్తే అలాంటి వారి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. రోడ్డు ప్రమాద బాధితులను ఆసుపత్రులకు చేర్చిన వారిపై ఏ విధమైన పోలీస్ కేసులు ఉండవన్నారు. అంతేకాకుండా వారిని ప్రోత్సహించేందుకు రూ.5000 నగదు బహుమతి , ప్రశంసా పత్రం అందిస్తారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామమనోహర రెడ్డి మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు రహదారి భద్రత నియమాలు పాటించాలన్నారు. ట్రాఫిక్ సీఐ సీతారామ రెడ్డి మాట్లాడుతూ టూ వీలర్ పై వెళ్లేవాళ్లు హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించేవారు సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడీలు, వైద్యులు, వైద్య విద్యార్థులు, మోటార్ వాహనాల తనిఖీ అధికారులు విజయభాస్కర్, ప్రసాద్, రోడ్ సేఫ్టీ ఎన్జీఓ రమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా చర్యలు పాటించాలి

వాహనదారులు రోడ్డు భద్రతా చర్యలు పాటించి ప్రమాదాలకు దూరంగా ఉండాలని అదనపు ఎస్పీ లోసారి సుధాకర్, ఆర్టీఓ మీరా ప్రసాద్, ఆర్టీసీ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు తెలిపారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా మంగళవారం నగరంలోని కోటిరెడ్డిసర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని అదనపు ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఆర్ఎం గోపాల్‌రెడ్డి, డిప్యూటీ సీటీఎం గజలక్ష్మి, సీఎంఈ లక్ష్మిభాస్కర్, డిప్యూటీ సీఏఓ రమణారెడ్డి, డబ్ల్యుఎం అజంతుల్లా, ఏటీఎం హరి, ఏటీఎం (కమర్షియల్) జనార్దన్, కడప డిపో మేనేజర్ డిల్లీశ్వరరావు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కేంద్రీయ విద్యాలయంలో రోడ్డు భద్రతా మాసోత్సవాల ప్రాధాన్యతను ఆర్టీసీ ఈడీ విద్యార్థులకు వివరించారు.